క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి నాదర్‌గుల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ రవీందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటిక్ ఫీడర్ ఏరియా వైకేఆర్, జయసూర్య పట్నం, సీబీ ఎన్‌క్లేవ్, సరస్వతి ఎన్‌క్లేవ్, సాగర్ ఎన్‌క్లేవ్, అంబేద్కర్ నగర్, మారుతీనగర్, టెంపుల్ టౌన్, చిల్కూరి ఎన్‌క్లేవ్, రఘు హోమ్స్, శ్రీరామ ఎన్‌క్లేవ్, ఆదిబట్ల శివాలయం , నాదర్‌గుల్ గ్రామం, ఆయోధ్యనగర్, శాంతి నగర్, ధరణి ఎన్‌క్లేవ్, గ్రీన్ హోమ్స్ కాలనీ, బాలాజీ హోమ్స్, మారుతి ఎన్‌క్లేవ్‌లో సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రాఘవేంద్ర హోమ్స్, ట్రెజరర్ ఎన్‌క్లేవ్, వైష్ణవి ఎన్‌క్లేవ్, పీఎంఆర్, కేఎంఆర్‌సీ, అగ్రికల్చర్ లైన్‌ను నిలిపివేయనున్నామని ఏఈ పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పర్యటన నేడు

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శనివారం పురపాలక సంఘం పరిధి పలు వార్డుల్లో పర్యటించనున్నారని కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రూ.8 కోట్ల 46 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, బీటీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు.

కాలనీల సమస్యలను పరిష్కరిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. నవచైతన్య కాలనీలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యూపీఎస్ పక్కన ఉన్న బోరు మోటార్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, వాటర్‌మెన్‌లు గణేశ్, అభిరామ్ కలిసి మరమ్మతు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నీటి సమస్య లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. నల్లాలకు మోటార్లు పెట్టడం, డబుల్ నల్లాలు, సైజుకు మించి తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జేఏసీ నేతల అరెస్టు



పోలీసుల అదుపులో జేఏసీ నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం మాడ్గుల, వెల్దండలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావ్‌ల పర్యటన నేపథ్యంలో గట్టుప్పలపల్లి మండల సాధన సమితి నాయకులను శుక్రవారం ఉదయం తలకొండపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మంత్రుల పర్యటనకు అడ్డుకుంటారని భావించి, జేఏసీ చైర్మన్ మకురాల అశోక్‌గౌడ్, నాయకులు వెంకటయ్య, శరత్‌చంద్ర, మహేశ్, శరత్‌లను అదుపులోకి తీసుకున్నారు. మంత్రుల పర్యటన అనంతరం విడిచిపెట్టారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ



రాములును పరామర్శిస్తున్న క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నం: మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములును బీఆర్‌ఎస్ నాయకుడు, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ పరామర్శించారు. ఇటీవల రాములు సతీమణి ముత్యాలమ్మ అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం క్యామ.. మాజీ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి, ముత్యాలమ్మ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు.

సంస్థాగత నిర్మాణమే బలమైన పునాది

కందుకూరు: కాంగ్రెస్ పార్టీకి సంస్థాగత నిర్మాణమే బలమైన పునాది అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి బాచుపల్లిలో గ్రామ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కృష్ణ, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా శ్రీశైలం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా లక్ష్మీబాయి, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా కృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా జహంగీర్, ఇందిరమ్మ కమిటీ విజయ్, సభ్యులుగా నవీన్‌గౌడ్, యుగంధర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.





ఔటర్ జంక్షన్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు

అడుగుకో గుంత.. ప్రయాణం చింత

- అధ్వానంగా విజయవాడ జాతీయ రహదారి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: నిత్యం రద్దీగా ఉండే విజయవాడ జాతీయ రహదారి అధ్వానంగా మారింది. అడగడుగునా ప్రమాదకరమైన గోతులు ఏర్పడి వాహనదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వైపు రహదారి విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోగా, మరో వైపు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. గుంతల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు విస్తరణ పూర్తయితే.. నూతనంగా రోడ్లు నిర్మిస్తారని ఆశించినప్పటికీ.. విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో కొత్త రోడ్డు సంగతి ఎలా ఉన్నా.. ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని వాహనదారులు, ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పగలు ఎలా ఉన్నా.. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డుకు మరమ్మతు, విస్తరణ పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **వెలగని వీధి దీపాలు**
>
> రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాదారులు గోతుల దగ్గరకు రాగానే అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుకనుంచి వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. సెంట్రల్ లైటింగ్ సిస్టం, కూడళ్లలో హైమాస్ట్ లైట్లు పనిచేయకపోవడం కూడా ఇందుకు కారణం. తక్షణమే రోడ్డు మరమ్మతు చేయడంతో పాటు.. విస్తరణ పనులు ప్రారంభించాలి.
>
> – ఆకుల ధన్‌రాజ్‌గౌడ్, బాటసింగారం

అభివృద్ధికి అడ్డుతగిలితే సహించం

- తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం
- అవినీతి, అక్రమాలకు పాల్పడితే వదలిపెట్టం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: అభివృద్ధి పనులకు అడ్డు తగిలినా, తప్పుడు ప్రచారం చేసినా సహించేది లేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం ప్రజాపాలన (క్యాంపు) కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పాలకుల హయాంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని భూములు దోపిడీకి గురయ్యాయని ఆరోపించారు. వాటిని కబ్జా చేసిన వారి భరతం పడతామన్నారు. గడిచిన 16 నెలల కాలంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

ఫ్యూచర్ సిటీతో మహర్దశ

అంబేద్కర్ చౌరస్తా నుంచి పొల్కంపల్లి వరకు రూ.40 కోట్లతో నిర్మించే రోడ్డు పనులు, రూ.37 కోట్లతో నిర్మించే పట్నం వంద పడకల ఆస్పత్రి పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వివిధ అభివృద్ధి పనులకు పట్నం మున్సిపాలిటీకి రూ.15 కోట్లు, టీజీఐఐసీ నుంచి యాచారం మండలానికి రూ.20 కోట్లు మంజూరు చేయించామని వివరించారు. విషపూరిత కంపెనీలను వ్యతిరేకించిన తాను.. ఫార్మాసిటీని వ్యతిరేకించానని వెల్లడించారు. అయితే ఫార్మా పేరుతో భూములు తీసుకొని ఫ్యూచర్ సిటీని ఎలా ఏర్పాటు చేస్తారని పేర్కొంటూ.. కొందరు న్యాయస్థానంలో ఆ పనులను ఆటంకం కలిగించేందుకు చూశారని, అందుకే ప్రభుత్వం కాలుష్యరహిత గ్రీన్ ఫార్మా సిటీగా పేరుమార్చిందని చెప్పారు. ఫ్యూచర్ సిటీతో యాచారం, కందుకూర్ మండలాలకు మహర్దశ పట్టనుందన్నారు.

తీరు మార్చుకోకపోతే..

తల్లిదండ్రులు తనకు రూ.కోట్లు ఇచ్చారని, ప్రజల సొమ్ము దోచుకోవాల్సిన అవసరంలేదని నాకు లేదని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా సహించేది లేదని హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కొందరు అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారు తీరు మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, మంఖాల దాసు ఉన్నారు.

'రాధాకృష్ణ' సేవలు ప్రశంసనీయం

మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్



ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

కడ్తాల్: జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ కుమారుడు రాధాకృష్ణ 5వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. చిన్న వయస్సులో రాధాకృష్ణ మృతి చెందడం బాధకరమన్నారు. ఇది దరశత్ నాయక్ కుటుంబానికి తీరని లోటన్నారు. ఆయన జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన ట్రస్ట్‌తో గడిచిన ఐదేళ్లుగా కోట్లాది రూపాయలతో స్వచ్ఛంద కార్యక్రమాలు, పేద ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమని ట్రస్ట్ చైర్మన్‌ను అభినందించారు. దశరథ్ నాయక్ మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవల రూపంలో ప్రజల గుండెల్లో తన కుమారుడిని చూసుకుంటున్నానని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల కాలంలో ఆత్మీయులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎద్మసత్యం, మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు విజితారెడ్డి, అనురాధ, నాయకులు కడారి రామకృష్ణ, జోగువీరయ్య, లాయక్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు సన్మానం



యాచారం: మంత్రులను సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

యాచారం: మాడ్గుల మండలం పర్యటన నేపథ్యంలో శుక్రవారం సాగర్ రహదారి గుండా వెళ్తున్న మంత్రులకు స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద కాంగ్రెస్ యాచారం మండల శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణరావులను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, గడ్డమల్లయ్యగూడ మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండీ రనీ పాల్గొన్నారు.

కొల్కులపల్లిలో ఘన స్వాగతం

ఆమనగల్లు: మాడ్గుల మండల కొల్కులపల్లి గ్రామంలో కల్వకుర్తి నియోజకవర్గ పర్యటనకు వెళ్తున్న మంత్రులు కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావ్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులకు మాజీ సర్పంచ్ అనురాధ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డిల ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సోమయ్య, మల్లయ్య, రాములు, కృష్ణయ్య, దనయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత

రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు వెంకటేశ్



కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటేశ్

ఆమనగల్లు: విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. విద్యారంగంలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. అన్ని సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు, మౌలిక వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే చిన్నారులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందజేసిందని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావ్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్, రామస్వామి, అశోక్‌రెడ్డి, మాధవి, కృష్ణయ్య, వనిత, మాలతి, కుసుమలత, మధుకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్, ప్రసాద్, మహేశ్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేబినెట్ నిర్ణయం.. చరిత్రాత్మకం

జీసీల రిజర్వేషన్ల ఆమోదంపై కాంగ్రెస్ శ్రేణుల హర్షం



సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంతో అధికార పార్టీ కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం టపాసులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్‌లపై కేబినెట్ ఆమోదం తెలపడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. దీంతో బీసీలకు పదవుల్లో అత్యధిక ప్రాధాన్యత లభించనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్, లక్పతినాయక్, వెంకటేశ్, మల్లేశ్‌గౌడ్, కేశవులు, నరేశ్ తదితరులు ఉన్నారు.

చౌదర్‌పల్లిలో ఘనంగా ఉర్సు

యాచారం: మండల పరిధి చౌదర్‌పల్లి గ్రామంలో ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముస్లిం మైనార్టీ ప్రతినిధుల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లతో ఊరంతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద ఉత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఏటా ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.



ఉత్సవంలో ముస్లింలు

ముగ్గురు ఎస్‌ఐలు బదిలీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ముగ్గురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారు నియమితులయ్యారు. ఇక్కడ నిన్నటి వరకు పని చేసిన రాజు ఘట్కేసర్ ఐటీ కారిడార్ పోచారం ఠాణాకు, బాలరాజు ఎల్బీనగర్ ట్రాఫిక్, సుధాకర్‌రెడ్డి ఎల్బీనగర్ సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో బి.సత్యనారాయణ, నోయల్‌రాజ్, సైదయ్యలు వచ్చారు. ఈ ముగ్గురు ఇటీవలే ట్రైనింగ్ పూర్తి చేసుకొని మొదటి పోస్టింగ్‌లో చేరారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



ఇబ్రహీంపట్నం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇబ్రహీంపట్నం/యాచారం: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం యాచారంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. యాచారం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కల్పించే ఉచిత వైద్య సేవలపై వివరించారు. వైద్యాధికారి ప్రియాంక, మృదుల్లా, లలితాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ, జనాభా, వనరుల సమతుల్యత, లింగ సమానత్వంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యురాలు సరిత, వైద్య సిబ్బంది మణి, మేరి, వేణు, రఘు తదితరులు పాల్గొన్నారు.



యాచారంలో..

కార్మికుల శ్రేయస్సుకు కృషి



తుక్కుగూడ: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వాణి

మున్సిపల్ కమిషనర్ వాణి

తుక్కుగూడ: మున్సిపల్ కార్మికుల శ్రేయస్సుకు తమవంతు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎ.వాణి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పారిశుద్ధ్యకార్మికులు, మహిళా సంఘాల సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 40వ రోజు ఈ వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కార్మికులు విధి నిర్వహణతో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. 8వ వార్డులో తడి, పొడి చెత్త వేరు చేయడం , పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వామన్‌గౌడ్, ఆర్‌ఐ మల్లేశ్, మున్సిపల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

ఆరోగ్యమే మహాభాగ్యం

పహాడీషరీఫ్: విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, స్వయం సహాయక గ్రూప్ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు ఈ సందర్భంగా సిబ్బందికి బీపీ, షుగర్, జ్వరం తదితర పరీక్షలను నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నిత్యం దుమ్ము, ధూళిలో ఉండే పారిశుద్ధ్య సిబ్బంది అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న మానవ జీవన శైలి కారణంగా ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతి రెడ్డి, టీపీలో హబీబున్నీసా, డీఈ ఇఫ్రత్ ఆయేషా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

మాడ్గుల: ఇర్విన్ గ్రామంలో నిర్మించనున్న రిజర్వాయర్ మార్కెట్ విలువ ప్రకారం రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందుకూరి జగన్ కోరారు. శుక్రవారం మాడ్గుల మండల కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో బీటీరోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణాల పనులు, పాఠశాలలో నెలకొన్న అదనపు తరగతి గదులు, భవనాల సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు డైరీలు అందజేత



డైరీలతో విద్యార్థులు. చిత్రంలో ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం రూరల్: పోల్కంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు నందిగామ కిషోర్ అండగా నిలిచారు. సొంత ఖర్చుతో శుక్రవారం డైరీలు అందజేసి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, దత్తాత్రేయ, ఇందిరా, గీత, అంబిక, అశోక్‌కుమార్, రాములయ్య, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ డిమాండ్



పాఠశాల నుంచి బుక్స్ తీసుకొస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: అధిక ఫీజులు వసూళు చేయడంతో పాటు.. స్టేషనరీ విక్రయిస్తున్న ఐరిస్ ఫ్లోరేట్స్ వరల్డ్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బోడ వంశీ, ఏర్పుల తరంగ్‌లు డిమాండ్ చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొహెడ రోడ్డులో ఉన్న పాఠశాలలో బుక్స్, స్టేషనరీని విక్రయిస్తున్నారని తెలిసి శుక్రవారం వారు పుస్తకాలతో ధర్నా చేశారు. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థి సంఘం నాయకుల మధ్య వాగ్వివాదం జరిగింది. నోటుబుక్స్ కొంటేనే పాఠ్యపుస్తకాలు ఇస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పడం దారుణమన్నారు. ఇలాంటి బడులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం మేరకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి వచ్చిన సిబ్బంది పాఠశాలలో నోటుబుక్స్ విక్రయిస్తున్న గదిని సీజ్ చేశారు. దీంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌చరణ్, అజయ్, వినయ్, సాయిరామ్, సంతోష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుక

కందుకూరు: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో మాజీ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. గోరింటాకుతో మహిళలకు విడదీయరాని అనుబంధమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు టి.ఇందిర, మాజీ ప్రజాప్రతినిధులు లలిత, జ్యోతి, సదాలక్ష్మి, ఇందిరమ్మ, నాయకులు ఎస్.జయమ్మ, ఎం.జయమ్మ, మాజీ సర్పంచులు మన్నె జయేందర్‌ముదిరాజ్, టి.దేవేందర్ ఉన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గోరింటాకు వేడుకల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు